www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 11 జనవరి 2024

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-అమలాపురం

ఎపి భూహక్కుల చట్టం 27/2023ను రద్దు చేయాలని కోరుతూ అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు బుధవారం 21వ రోజు కు చేరాయి. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో కోర్టు ఎదుట ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎండి.అజామ్, సిహెచ్.అజయ్ కుమార్, ఎ.సురేష్, బిబి.జోగేష్, ఎన్.కృష్ణమూర్తి, హమీద్ పాషా, పి.సుబ్రహ్మణ్యం, ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలకు సై

- సిద్ధమవుతున్న బరులు
- శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- రూ.కోట్లు గడించేలా సన్నాహాలు
- మరోవైపు పోలీసుల హెచ్చరికలు



కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో సిద్ధమవుతున్న కోడిపందేల బరి

ప్రజాశక్తి-కాట్రేనికోన

ప్రతి ఏటా సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడి పందేలు, గుండాటలు నిర్వహించడం షరా మామూలుగానే సాగుతోంది. పండుగకు ముందు పోలీసు శాఖ వారు హెచ్చరించడం... పందెం రాయుళ్లు తమ పని కానివ్వడం ప్రతి ఏటా జరిగే తంతే. అయితే ఈ ఏడాది పండుగ వాతావరణం కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఒక పక్క పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ నిర్వాహకులు జెసిబిలు, ట్రాక్టర్లతో కోడి పందేల కోసం బరులను చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాట్రేనికోన మండలం గెద్దనపల్లి గ్రామంలో సంక్రాంతి పండగ ముసుగులో కోడిపందేలు నిర్వహించడం అనాథిగా వస్తోంది.

కార్పొరేట్ స్థాయి ఈవెంట్లను తలపించేలా

కోనసీమ ప్రాంతంలో కోడి పందేలను కార్పొరేట్ స్థాయి ఈవెంట్లలా నిర్వహించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీ మారింది. సంక్రాంతి పండగను పురస్కరించుకుని పండగ మూడు రోజులు కనీసం రూ.కోట్లు లాభం గడించేలా నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. గెద్దనపల్లిలో గతంలో కోడిపందేలు నిర్వహించే స్థలం పక్కనే సుమారు ఐదు ఎకరాల వరి చేనును చదును చేస్తున్నారు. ఇక్కడ భారీ ఎత్తున సాగే పందేలకు ఇతర ప్రాంతాల పందెంరాయుళ్లను రమ్మంటూ ఆహ్వానాలు పంపిస్తున్నారు. ఇక్కడ గుండాటలు నిర్వహణకు జరిగిన వేలం లో కొందరు వ్యక్తులు భారీ మొత్తంలో పాడుకున్నట్లుగా తెలియవస్తోంది. ఇక్కడ మూడు రోజుల పాటు వ్యాపారం నిర్వహించుకొనేందుకు స్టాల్స్ కొరకు సొమ్ములు భారీగానే వసూలు చేస్తున్నారు. గెద్దనపల్లి గ్రామ సచివాలయం చెంతనే భారీ బరుల ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. పందేలను వీక్షించేందుకు భారీ స్టేజీ నిర్మిస్తున్నారు. విఐపి గ్యాలరీ, వివిఐపి గ్యాలరీల నిర్మాణం కొరకు భారీ ఎత్తున షామియానా బరుల నిర్వహించే ప్రాంతం వద్దకు చేరుకుంది. పందెంరాయుళ్ల వినోదం కొరకు, మందు, విందు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. మూడు రోజుల్లో కనీస మొత్తంగా రూ.కోట్లు కొల్లగొట్టేందుకు నిర్వాహకులు పావులు కదుపుతున్నారు. వచ్చిన సొమ్మును గ్రామ అభివద్ధికి ఖర్చు చేస్తామని నిర్వాహకులు చెప్పడం మరీ విడ్డూరంగా ఉంది. గతేడాది కోనసీమ జిల్లా ఎస్‌పి సుధీర్ కుమార్ రెడ్డి గుండాటలు, జూదాలపై ఉక్కుపాదం మోపారు. జిల్లాలో ఎక్కడా గుండాటలు జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత ఎస్‌పి శ్రీధర్ కోడి పందేలు, జుదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. గతేడాది వలె కేవలం కోడి పందేలు నిర్వహణ తప్ప గుండాట ఇతర జూద క్రీడలు లేకుండా నియంత్రించడంలో పోలీసులు ఏ విధంగా వ్యవహరిస్తారన్నది వేచి చూడాలి.

గ్రామాభివృద్ధి కోడి పందేల సొమ్ము

గడచిన కొన్నేళ్లుగా కాట్రేనికోన మండలం గెద్దనపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలతో పాటు గుండాట నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా కేవలం గుండాట ద్వారానే రూ.లక్షలు ఆదాయం సమకూరుతుంది. ఈ ఆదాయంతో గ్రామంలో ఆలయం నిర్మాణంతో పాటు విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం నిర్మించుకున్నారు. సంక్రాంతి పండగకు బయట ప్రాంతాల నుంచి తమ వారి కోసం గెట్ టు గెదర్ ఏర్పాటు చేసుకుని సహఫంక్తి భోజనాలు వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అంతేకాక అనాథలైన వృద్ధులకు పండుగ మూడురోజులూ భోజనాన్ని వారి వారి ఇళ్లకే పంపిస్తుంటారు. మిగిలి ఉన్న సొమ్మును తమ వర్గానికి చెందిన క్షత్రియులకే అర్థ రూపాయి వడ్డీ అప్పు ఇచ్చి తమ వారి అభివద్ధికి బాటలు వేసుకుంటున్నారు. వడ్డీకి తీసుకున్న సొమ్మును వచ్చే సంక్రాంతికి అసలు, వడ్డీ కలిపి చెల్లించాల్సి ఉంటుంది. వీటితో పాటు గ్రామంలోని ఆసరాలేని వృద్ధులకు రెండు పూటలా ఆహారాన్ని వండించి వృద్ధుల ఇంటి వద్దకే భోజన సరఫరా చేసే కార్యక్రమం సంవత్సరం పాటు చేపడతారు. వీటితో పాటు అనేక సేవా కార్యక్రమాలు, ఆర్థిక వెనుకబడిన వారిని ఉన్నతచదువుల విషయంతో ఆర్థిక సాయం చేస్తారు. ఈ సొమ్మును కేవలం ఒక్క సామాజిక వర్గానికే అందిస్తున్నారనే విమర్శలున్నాయి. గ్రామంలో అందరి అభివృద్ధికి ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు. గెద్దనపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



తునిలోని చామవరంలోజరిగిన సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

వైసిపి నేతలు మెక్కిందంతా కక్కిస్తాం

'రా..కదిలి రా' బహిరంగ సభలో చంద్రబాబు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఐదేళ్ల పాటు వైసిపి నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని, తాము అధికారంలోకి రాగానే వైసిపి నేతలు మెక్కిందంతా కక్కిస్తామని టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తునిలోని చామవరంలో బుధవారం నిర్వహించిన 'రా.. కదిలిరా' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ నేడు రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారన్నారు. ప్రజలపై పెనుభారాలు మోపారన్నారు. జగన్ అహంకారమే అతని అంతానికి దారి తీసే పరిస్థితి నేడు నెలకొందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించి రాష్ట్రాన్ని గెలిపించాలన్నారు.

భారీగా పెరిగిన నిత్యావసరాలు

5 ఏళ్లలో రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. టిడిపి హయాంలో రూ.70 ఉన్న పెట్రోలు నేడు రూ.110కి, రూ.70 ఉన్న డీజిల రూ.98 పెరిగాయన్నారు. బియ్యం, పప్పుల ధరలు రెట్టింపు అయ్యాయన్నారు. వంటనూనె రూ.60 నుంచి రూ.130కి ఎగబాకిందన్నారు. ఎల్‌పిజి గ్యాస్ సామాన్యులు కొనుగోలు చేయని పరిస్థితికి వచ్చిందన్నారు. పెరిగిన ధరలతో మళ్లీ కట్టెల పొయ్యిపై ఆడబిడ్డలు వంట చేసుకుంటున్నారన్నారు. టిడిపి అధికారంలోకొస్తే ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. పండుగ వేళ ప్రజలు పస్తులుండే పరిస్థితిని తీసుకొచ్చారన్నారు.

టిడిపితోనే ప్రజల జీవితాల్లో వెలుగులు

సంక్షేమం, అభివృద్ధితో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపింది టిడిపియేనని బాబు అన్నారు. పేదల్ని ఆదుకునే బాధ్యత తనదేనన్నారు. అన్న క్యాంటీన్లు మళ్లీ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చుతానని తెలిపారు. టిటిడిలోనూ భక్తులకు నాసిరకం భోజనం పెట్టడం దుర్మార్గమన్నారు. త్వరలోనే పేదల ప్రభుత్వం, రైతు రాజ్యం వస్తుందన్నారు. వచ్చే సంక్రాంతికి ప్రజల ముఖాల్లో వెలుగులు నింపుతామన్నారు. మ్యానిఫెస్టోలో అంశాలను ఆయన వివరించారు.

నిరాశలో నిరుద్యోగులు

జగన్ నిరుద్యోగులను తీవ్రంగా నిరాశపరిచారని బాబు అన్నారు. జాబ్ క్యాలెండర్, మెగా డిఎస్‌సిలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తమ పాలనలో లక్షలాది టీచర్ పోస్టులను భర్తీ చేశామని గుర్తు చేశారు. జగన్ ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయలేదన్నారు. జాబు కావాలంటే బాబు రావాలన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చారు. అన్నదాత పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్నారు. ఆక్వా రైతుల్ని ఆదుకుంటామని తెలిపారు. జగన్ అప్పుల కోసం ప్రభుత్వ ఆస్తుల్ని తాకట్టు పెట్టారన్నారు. మళ్లీ గెలిస్తే ప్రజల్ని కూడా తాకట్టు పెడతాడని విమర్శించారు.

రాజధాని లేకుండా చేశారు

మూడు రాజధానుల పేరుతో జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హయాంలో రాజధానిగా అమరావతే ఉంటుందన్నారు. పరిశ్రమల పొల్యూషన్ కంట్రోల్ చేసి మత్స్యకారులను రక్షిస్తామన్నారు. మత్స్యకారులను తామే ఆదుకున్నామన్నారు. జగన్ జిఒ 217 తీసుకొచ్చి మత్స్యకారుల పొట్టకొట్టారన్నారు. మద్య నిషేదం, పోలవరం, సీపీఎస్ రద్దు, ప్రత్యేక హోదా హామీలు ఏమయ్యాయన్నారు.

అసైన్డ్ భూముల లబ్ధిదారులకు ఇకెవైసి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఇరవై సంవత్సరాల క్రితం అప్పగించిన అసైన్డ్ భూములపై సంపూర్ణ ఉచిత హక్కులు ఆయా లబ్ధిదారులకు ఇకెవైసి, డిజిటల్ సంతకాలు ప్రక్రియలు పూర్తిచేసి కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్ రెవెన్యూ అధికారులు ఆదేశించారు.

బుధవారం అమరావతి భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.సాయి ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అసైన్డ్ భూముల పై 20 సంవత్సరాల పైబడిన వారికి ఉచిత హక్కుల కల్పన, అసైన్ భూములు రీ వెరిఫికేషన్, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా నివేశన స్థలాల పంపిణీ తదితర అంశాలపై వివిధ జిల్లా జాయింట్ కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ రెవెన్యూ సిబ్బంది ని ఉద్దేశించి మాట్లాడుతూ రీ వెరిఫికేషన్ తదితర భూ సంబంధిత వివరాలను విఆర్ఓ, తహశీల్దార్, ఆర్‌డిఓ లాగిన్ లపై ప్రతి దశలో సమీక్షలు నిర్వహించి ఆశించిన పురోగతిని తీసుకుని రావాలని ఆదేశించారు. యాదృచ్ఛికంగా భూముల రీ వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించి పారదర్శకంగా నివేదికలను రూపొందించాలన్నారు. ఈనెల 18న భూ చట్టాలపై అమరావతి సీసీఎల్‌ఏ కార్యాలయం లో శిక్షణ కార్యక్రమం ఉందని ఆ శిక్షణకు తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ స్థాయి అధికారులను ఇద్దరిని పంపాలని ఆమె ఆదేశించారు. 90 రోజులలో నివేశ న స్థలాల కేటాయింపుకు సంబంధించి నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల లేఅవుట్ల కొరకు దరఖాస్తు చేసు కున్న వారి దరఖాస్తులను పరిశీలించి స్థలాలు కేటాయించాలన్నారు. పెండింగ్ కోర్టు కేసులు క్లియర్ చేస్తూ లేఔట్లలో స్థలాలు అప్పగించాలన్నారు. జగనన్న కాలనీ లేఅవుట్లల్లో సేకరించిన భూమి విస్తీర్ణం, భూమికి చెల్లించిన ఖరీదు, లబ్ధిదారుల సంఖ్య, ఒక ప్రొఫార్మాలో నింపి సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈనాం భూముల పై ఉచిత హక్కులు కల్పనపై కూడా దృష్టి సారించాలన్నారు. వివిధ ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో బరియల్ గ్రౌండ్స్ కు సేకరించిన స్థలాల వివరాలను సిద్ధం చేయాలన్నారు. జర్నలిస్ట్ గృహ నిర్మాణ పథకానికి భూములను ఎంపిక చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, భూసేకరణ విభాగపు సెక్షన్ అధికారి పి.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దార్ చిన్నబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న హరీష్ , పాల్గొన్న రమణారావు తదితరులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి-అంబాజీపేట

ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని నియోజకవర్గ టిడిపి కన్వీనర్ గంటి హరీష్ మాధుర్ అన్నారు తొండవరంలో ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ స్వచ్ఛం ద సంస్థ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. హరీష్ బాలయోగిరక్తదానం చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో కుంచే రమణారావు, ఎస్‌సి నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, యువకులు పాల్గొన్నారు.

12న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం సబ్‌స్టేషన్‌లో ఈ నెల 12న శుక్రవారం 10 నుంచి మధ్యాహ్నం 2 రెండు గంటల వరకు లైన్ క్లియర్ పొందేదుకు విద్యుత్‌సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. రవి కుమార్ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లవరం మండల పరిధిలో అల్లవరం, బెండమూరు లంక, పేరూరు, టిడ్‌కో దేవగుప్తం, రూరల్ మండల పరిధిలో పేరూరు సబ్‌స్టేషన్లలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసనలు



అమలాపురంలో అంగన్‌వాడీల 24 గంటల నిరాహార దీక్ష, పాల్గొన్న కె.కృష్ణవేణి తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్ల సాధన కోసం గత 30 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీల కొనసాగుతోంది. బుధవారం జిల్లాలో అంగన్‌వాడీలు పలు విధాలుగా నిరసన తెలిపారు. అమలాపురంలో 24 గంటల నిరాహార దీక్షలు కొనసాగాయి.

అమలాపురం అంగన్వాడి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ అమలాపురం కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా 24 గంటల నిరాహార దీక్షలు బుధవారం 5 వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను సిఐటి యు నాయకులు భాస్కరావు, వెంకటలక్ష్మి ప్రారంభించి మాట్లాడుతూ వైఎస్.జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయమని గత 30 రోజులుగా అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున సమ్మె చేస్తే సమస్యల పరిష్కారం చేయకుండా వారిని భయభ్రాంతులకు గురి చేయడం దారుణం అన్నారు. ఇన్ని రోజులు సమస్యలు పరిష్కారం చేయకుండా రోడ్లమీద కూర్చోబెట్టిన సిఎం జగన్‌కు మహిళలందరూ తగిన గుణపాఠం చెప్పాలని ఆయన అన్నారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ అంగన్‌వాడీలు సమస్యలు పరిష్కారం చేయకుండా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయకుండా సమ్మె విరమించేది లేదని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి. వెంకటలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శులు నూకల బలరాం మాట్లాడారు. ఈ దీక్షలో స్వర్ణలత, శ్రీ లక్ష్మి, భవాని, కుమారి, పోసిరత్నం, భవిత, వెంకటేశ్వరి, కలరత్నం, దుర్గ భవాని, ఆసిమ్, లక్ష్మి, రేవతి తదితరులు ఈ దీక్షలో పాల్గొన్నారు. **మండపేట** న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకుండా ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచేది లేదన్నారు. వెంటనే వేతనాలు పెంచుకున్నట్లు మరో జిఒ ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలన్నారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. వర్కర్లతో సమానంగా మినీ వర్కర్లకు వేతనాలు పెంచాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కలిపించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి, బీమా అమలు చేయాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం సరఫరా చేయలి. ఆయిల్, కందిపప్పు, క్వాంటిటీ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** సమస్యలు పరిష్కారించాలంటు సమ్మె చేస్తున్న అంగన్ వాడీల పై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి భయపెట్టాలని ప్రయత్నించడం దుర్మార్గపు చర్య అని సిఐటియు జిల్లా కార్యదర్శి జి దుర్గా ప్రసాద్ మండిపడ్డారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అధ్యక్ష, కార్యదర్శులు జయ లక్ష్మి, దుర్గా మల్లేశ్వరిల అద్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు దీక్షా శిబిరంలో కుర్చీలు నెత్తిన పెట్టుకుని నిరసన తెలియజేశారు. అంగన్‌వాడీలు తమకు గౌరవ వేతనం వద్దు, కనీస వేతనం కావాలి అంటూ నినాదాలు చేశారు. సెక్టార్ లీడర్ ధనలక్ష్మి, జి.శ్రీదేవి, వి.తలుపులమ్మ, ఎన్.విజయ కుమారి, కె. సత్యవతి, సుబ్బలక్ష్మి, హైమావతి, జి.మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం** ప్రభుత్వ మొండి వైఖరికి రోడ్డు మీద తిన్న భోజన బాక్స్ లతో 30 అంకె వేసి నిరసన తెలియ చేశారు సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మెలో రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన 400 మంది అంగనవాడిలు మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ధర్నాలో పాల్గొన్నారు. ఈ ధర్నా లో జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, అంగనవాడి జిల్లా కార్యదర్శి దుర్గమ్మ, ప్రాజెక్టు అధ్యక్షురాలు వీరలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిపిఐ నాయకులు మద్దతు తెలియజేశారు. వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ అంగన్‌వాడీలు 30 రోజులుగా సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వం గుడ్డిగా వ్యవహరి స్తుందన్నారు. సమ్మెలో అంగనవాడి నాయకులు వాసంశెట్టి సూర్యకుమారి, విజయ లక్ష్మి,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు** తహశీల్దార్ కార్యాలయం ఎదుట 30అంకె ఆకారంతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయ కులు కుడిపూడి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని అన్నారు.



ముమ్మిడివరంలో కుర్చీలు నెత్తినపెట్టుకుని అంగన్‌వాడీల నిరసన



మండపేటలో అంగన్‌వాడీల నిరసన




రామచంద్రపురంలో భోజనం బాక్స్‌లతో అంగన్‌వాడీల నిరసన



మామిడికుదురులో 30 అంకెఆకారంలో అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



పేరూరులో 'సామాజిక సమతా సంకల్పం'

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

పేరూరులో సామాజిక సమతా సంకల్పం కార్యక్ర మాన్ని సర్పంచ్ దాసరి అరుణడేవిడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముందుగా తాడిగుంట సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న సిఎం జగన్ ఆవిష్కరిస్తారన్నారు. అందుకు సంఘీభావంగా సంతకాల సేకరణ కార్య క్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుడుపూడి సత్య నారాయణ, ఎంపిటిసి సభ్యులు చోళ్లంగి సుబ్బరామ్, వాసంశెట్టి శ్రీనివాస్, అంబేద్కర్ యువ జనసంఘ అధ్యక్షులు జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు

ఘనంగా జాతీయ యువజనోత్సవాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

వివేకానందుని జయంతి సందర్భంగా జిల్లా పలుచోట్ల జాతీయ యువజనోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

మండపేట నేటి ఆధునిక సమాజంలో యువత పాత్ర ఎంతో కీలకమని రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ఆలమూరు రోడ్డులోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో విజ్ఞాన కళా వైభవం సృజనోత్సవం-2024 పేరిట యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిఎస్‌పి, కళాశాల పూర్వ అధ్యాపకులు నగేష్ బాబు, శ్రీనివాసాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి, వివేకానందుడు చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లులు, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్రత్వం, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. దేశ భక్తిని ప్రతిబింబించే నత్య రూపకం, మగువ ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించే నత్య రూపకం అందర్నీ ఆకట్టుకుంది. **ముమ్మిడివరం** జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల్లో పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ మరియు చైతన్య వాలంటరీ ఆర్గనైజేషన్లు సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో బాలురుకు ఆట పోటీలు, మరియు బాలికలకు కబడ్డీ, రంగోలి పోటీలు నిర్వహించారు. **అమలాపురం** యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ కాకినాడ వారి ఆధ్వర్యంలో అమలాపురం జూనియర్, డిగ్రీ కళాశాల్లో జాతీయ యువజనోత్సవాలు జరిగాయి.



మండపేటలో జరిగిన కార్యక్రమంలో దేశభక్తి గేయం

కప్పగంతులతో ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

సమగ్ర శిక్షలో పని చేసే వివిధరకాల ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సాధించే వరకు సమ్మెను విరమించేది లేదని ఎస్-ఎస్‌ఎ జిల్లా జెఎసి స్పష్టం చేసింది. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ కళాశాల లోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో రాష్ట్ర పిలుపులో భాగంగా 22వ రోజైన బుధవారం అధిక సంఖ్యలో ఎస్‌ఎస్‌ఎ లు సమ్మె లో పాల్గొని కప్ప గంతులు వేస్తూ నిరసన తెలియజేశారు. వీరికి పలువురు మద్దతు తెలిపారు.కార్యక్రమంలో జెఎసి నాయకులు సిహెచ్ .వెంకన్న బాబు, డి.శ్రీనివాస రావు, ఎన్.వెంకట రమణ, ఎ.గౌతమ్ ప్రసాద్, ఎం.అనూష, సత్యనారాయణ పినిపే శ్రీనివాస్, కె. సుబ్రమణ్యం, కార్మిక సంఘం సిఐటియు నాయకుడు జి దుర్గా ప్రసాద్, యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులతో పాటు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులు

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మూడేళ్ల క్రితం కిర్లంపూడి మండలం తామరాడ వద్ద 750 కేజీల గంజాయిని వదిలేసి పరారైన ముద్దాయిలను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు జగ్గంపేట సిఐ లక్ష్మణరావు తెలిపారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021లో కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ తిరుపతి రావు నమోదు చేసిన కేసును సాంకేతిక పరిజ్ఞానంతో చేదించడం జరిగిందన్నారు. 750 కేజీల గంజాయి 152 ప్యాకెట్లుగా చేసి స్కార్పియో వాహనంలో తరలిస్తూ ఆ వాహనాన్ని తామరాడ కాలువ గట్టున వదిలి వెళ్ళిపోయారని చెప్పారు. ఆ కేసులో ఐదుగురు ముద్దాయిలలో హనుమన్ శేకులల్ మోహింతి, సమీర్ సుధాకర్ గవండే అను ఇద్దరు మహారాష్ట్రకు చెందిన వారిని కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ గేట్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు సిఐ చెప్పారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరులో బుధవారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా సారా తయారికి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. పెద్దాపురం స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పట్టణ శివారులోని పిఠాపురం రోడ్‌లో తంబూరి వారి గొయ్యి సమీపాన నాటు సారాయి తయారీ కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో సిఐ సురేష్, ఎస్ఐ మౌనిక, సిబ్బంది ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో 50 లీటర్లు సారా స్వాధీనం చేసుకుని, 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అరెస్టు చేసిన వ్యక్తి గతంలో సారా కేసుల్లో ముద్దాయేనని సిఐ సురేష్ తెలిపారు. ఈ దాడుల్లో విఆర్ఒ ఎన్.మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్

ప్రజాశక్తి-అమలాపురం

యువతకు ఉద్యోగావకాశాలు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు ఆన్లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వెబ్సైట్ పోర్టల్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాల సమాచారం తెలుసుకుని ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విధంగా కొత్త వెబ్ సైట్ పోర్టల్ అందు బాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఆన్లైన్లో ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్ వెబ్సైట్ ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసిందన్నారు.. ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాల సమాచారం. తెలుసుకుని ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునే విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ నమోదులో సీనియార్టీని బట్టి ఉద్యోగాల భర్తీ జరిగేదన్నారు. ఇప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వెబ్ పోర్టల్ లు అభివద్ధి చేయడం యువతకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. టెన్త్ దగ్గర నుంచి డిగ్రీ, వరకు డిప్లమో ఏది చేసినా సరే ఈ పోర్టల్ లో నమోదు చేసుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలు వెంటనే తెలుసుకోవచ్చన్నారు. ఎంప్లాయిమెంట్ కార్డు లాగిన్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి వసంతలక్ష్మి మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఎంబీఏ, డిగ్రీ కోర్సులు సహా ఐటీ, టెక్నికల్ రంగాలకు యువత ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో వారి అవసరాలకు పెద్దపీట వేస్తూ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వెబ్ పోర్టల్ రూపొందించినట్లు తెలిపారు. ఆధార్ ఫోన్ నంబర్ ద్వారా లాగిన్ అయి విద్యార్హతల వివరాలను పోర్టల్లో నమోదు చేయగానే మొబైల్ సందేశంగా వస్తుందన్నారు. అభ్యర్థుల వివరాలు జిల్లాస్థాయి అధికారికి చేరి, వారి ఆమోదంతో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నెంబర్ తెలియజేస్తారన్నారు. జిల్లాలో గల నిరుద్యోగ అభ్యర్థులకు ఆన్లైన్ లో సేవలు, ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ అదనపు అర్హతలు నమోదు సులభరీతిన %employment. ap.gov.in% వెబ్ పోర్టల్ ద్వారా అందచేయబడిందన్నారు. పైన తెలిపిన సేవలు జిల్లా ఉపాధి కార్యాలయం, మోడల్ కెరీర్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మొబైల్ ద్వారా కూడా తాము ఉన్న చోట నుంచే సులభంగా పొందవచ్చును. అభ్యర్థి తన ఎంప్లాయిమెంట్ కార్డును లాగిన్ ద్వారా డౌన్లోడ్ చేసుకునే సదుపాయం కలదన్నారు. ఇది వరకు జిల్లా ఉపాధి


ఆన్లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ వెబ్సైట్ పోర్టల్ ప్రారంభిస్తున్న జెసి

కార్యాలయంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉన్న అభ్యర్థులు మీ పాత ఎంప్లాయిమెంట్ కార్డు నంబరుతో వివరాలను సరి చూసుకుని మీ యొక్క కొత్త ఎంప్లాయిమెంట్ కార్డును పొందవచ్చన్నారు. పైన తెలిపిన సేవలను బుధవారం నుంచి వినియోగించుకోవలసినదిగా అభ్యర్థులకు తెలియజేశారు. ఇతర సహాయం కొరకు కార్యాలయ పనివేళలో 10.30 గంటల నుంచి 5 గంటల వరకు సెల్ నెం.8121838392లో సంప్రదించగలరన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె


రామచంద్రపురంలో సమ్మె శిబిరంలో కృష్ణారావు తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం

డిమాండ్ల సాధన కోసం గత 16 రోజులుగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు నిరసన తెలిపారు. బుధవారం వారి సమ్మె కొనసాగింది.

మండపేట సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతాలు ప్రభుత్వం పెంచాలన్నారు. కనీస వేతనం రూ.26వేల ఇవ్వాలని, సిఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్ ఇఎస్ ఐ, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదష్టకరమన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండు వారాలుగా నిరసన చేస్తున్నా, ప్రభుత్వం పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడం దారుణమని సిఐటియు మరియు ఎఐటియుసి దుయ్యబట్టారు. ముమ్మిడివరంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట జాతీయ రహదారి 216 పై మానవ హారం నిర్వహించి నిరసన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో మున్సిపల్ ఉద్యోగులు ఎస్.అరుణ్ కుమార్, నక్కా అరుణ్, ఎం.శ్రీనివాసరావు, కాశి జార్జి, జి.రమేష్, నిమ్మకాయల వెంకటేష్, బొజ్జమ్మ, రమణమ్మ, మహాలక్ష్మి, మాణిక్యం, మంగాలతో పాటు పలువురు కార్మికులు పాల్గొ


ముమ్మిడివరం జాతీయరహదారి 216పై కార్మికుల మానవహారం

న్నారు. **రామచంద్రపురం** మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను సమ్మెను ఉద్దేశించి బుధవారం సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరామ్, మండల నాయకులు గోరిపర్తి నాగ భూషణం మాట్లాడారు. సమ్మెలో పిల్లి వెంకటరావు, చేగొండి సుబ్బారావు,గుత్తుల తాతారావు, మేడిశెట్టి నాగబాబు, గోరిపర్తి భీమశంకర్, ముత్యాల నాగరాజుతదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె రామచంద్రపురం పట్టణంలో8 వ రోజు కు చేరుకుంది. నిరసన శిబిరాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కిర్ల కష్ణారావు బుధవారం సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కోకన్వీనర్ ఎం ప్రేమానందం, కె.కృష్ణారావులు మాట్లాడారు.

యానాం వార్తలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి - యానాం

మద్యం మత్తులో కారును డ్రైవ్ చేసి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన బుధవారం యానాంలో జరిగింది. ఉమ్మడి కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన కోట చందన కుమార్, కర్రి యశ్వంత్ చెన్నైలో ఉంటున్నారు. అయితే కొద్ది రోజులుగా అరటికాయలలంక వద్ద ఉన్న రిసార్ట్‌లో ఉంటున్నారు. యానాం వచ్చి మద్యంను పూటుగా దాగి కారును డ్రైవ్ చేసుకుంటూ వెళుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆ యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. అయితే కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఈ మేరకు ఇద్దరి యువకులపై కేసు నమోదు చేసి, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పువ్వుల వీరభద్రరావు వెల్లడించారు.

మహోన్నత వ్యక్తి అంబేద్కర్

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



తొలి సంతకం చేస్తున్న మంత్రి విశ్వరూప్

దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు దిశా నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గొల్లవిల్లి సచివాలయం వద్ద బుధవారం ఏర్పాటుచేసిన అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ పాల్గొని ఫ్లెక్సీ పై తొలి సంతకం చేశారు. సిఎం జగన్ విజయవాడ నగర బొడ్డున 125 అడుగుల ఎత్తుగల భారీ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహాన్ని నెలకొల్పి చరిత్రలో మిగిలిపోతారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఉపసర్పంచ్ దొంగ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అమలాపురం(అల్లవరం)

అల్లవరం మండలం గోడి గ్రామంలో జగనన్న కాలనీ లో జలజీవన్ మిషన్ లో భాగంగా రూ.45 లక్షల వ్యయంతో నిర్మించన్నున్న 40 కెఎల్ సామర్థ్యం గల ఒహెచ్ఎస్ఆర్‌ట్యాంక్‌కు ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం శంకుస్థాపనకు చేశారు. ఈ ట్యాంక్ నిర్మాణం కోసం స్థలాన్ని ఉచితంగా ఇచ్చిన కొమరగిరి పట్నం గ్రామానికి చెందిన నామన సిద్ధాంతికి జగనన్న కాలనీ వాసుల తర పున గ్రామ ప్రజల తరపున బొమ్మి ఇజ్రాయిల్ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గోడి సర్పంచ్ తోట శ్రీదేవి, స్థానిక ఎంఎంటిసి సభ్యురాలు కాండ్రేగుల వాణి అచ్యుతం, దొమ్మేటి వెంకటేశ్వరరావు, రేవు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి-మండపేట

ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ అన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కేశవరం గ్రామంలో పోలింగ్ బూత్‌లను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 63 పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని అన్నారు. ఆయన వెంట సిఐ శ్రీధర్ కుమార్, ఎస్ఐ శివకష్ణ, ఎంపిపి ఉండమట్ల శ్రీనివాస్, వైసిపి నాయకులు ఉన్నారు.

ఇవిఎంలపై అవగాహన

ఏడిద సీతానగరంలో ఇవిఎంలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ వరదా చక్రవర్తి, మండల ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటుకు విజ్ఞప్తి

ప్రజాశక్తి-రామచంద్రపురం

వచ్చే ఎన్నికల్లో పోలింగ్ సమయంలో జరిగే అల్లర్లను పరిష్కరించేందుకు డిఎస్‌పి నేతత్వంలో ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని పలు పార్టీల నాయకులు రామచంద్రపురం ఆర్‌డిఒ సుధా సాగర్ కు విజ్ఞప్తి చేశారు. బుధవారం నెం. 42 రామచంద్రపురం అసెంబ్లీ నియోజక వర్గం లోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్ పై సమావేశం ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు ఇచ్చిన సూచనలు సలహాలు తీసుకొని పై అధికారులకు నివేదించి తగు చర్యలు తీసుకుంటామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు . కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అమలాపురం

కోనసీమ రైల్వే సాధన సమితి బుధవారం అల్లవరం మండలం బోడసకుర్రు వద్ద వైనతేయ నదిపై నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులను పరిశీలించింది. అక్కడ ఉన్న రైల్వే సిబ్బందిని , ప్రాజెక్ట్ అధికారులను అడిగి రైల్వే ప్రాజెక్ట్ పురోగతిని గురించిన వివరాలను తెలుసుకుంది. ఈ రైల్వే ప్రాజెక్ట్ పరిశీలనలో కోనసీమ రైల్వే సాధన సమితి(కెఆర్ఎస్ఎస్) కన్వీనర్ డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌సి కుడుపూడి సూర్య నారాయణరావు, సప్పా నాగేశ్వర రావు, బిఎస్ మూర్తి, ఉప్పుగంటి భాస్కరరావు, పోలిశెట్టి శివాజీ, ఎరగర్త వెంకటేశ్వరరావు, దొమ్మేటి సత్యనారాయణ మూర్తి, జివి కష్ణారావు, తదితరులు ఉన్నారు.

గోపాలరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

వైసిపి సీనియర్ నాయకులు పరమట గోపాలరావు ఆకస్మిక మృతి తీరని లోటని అమలాపురం నియోజకవర్గ ఆ పార్టీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. వన్నె చింతలపూడి కి చెందిన వైసిపి నాయకుడు పరమట గోపాలరావు ఆకస్మికంగా మృతి చెందారు. గోపాలరావు భౌతికఖాయానికి రమణారావు బుధవారం శ్రద్ధాంజలి ఘటించారు. గోపాలరావు కుటుంబ సభ్యులకు రమణారావు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డివిఎన్ఎస్ .వర్మ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.సిహెచ్‌విఎస్.పరమేశ్వరావు మాట్లాడారు. కార్యక్రమంలో 125 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

ప్రజాశక్తి-ఆత్రేయపురం


పుట్టిన బిడ్డతో సుజాత

108 వాహనంలో ఆసుపత్రికి వెళ్తున్న గర్భిణికి మార్గమధ్యలో పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. బుధవారం వెలిచేరుకు చెందిన గర్భిణి జొన్నకోటి సుజాత అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసు108లో రాజమహేంద్రవంలో ఆస్పత్రిలో చేరేందుకు వెళుతోంది. ఆమెకు మార్గం మధ్య లో నొప్పులు ప్రారంభమయ్యాయి అంబులెన్స్‌ను పక్కకు నిలిపి టెక్నీషియన్ ఎన్.రవి శేఖర్ పైలట్ కె.కిషోర్ బాబు ఇద్దరు అంబులెన్స్‌లో ప్రసవం చేశారు. అమెకు మగ బిడ్డ కు పుట్టాడు. తల్లి,బిడ్డను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-అమలాపురం రూరల్


చిందాడగరువులో నిత్యావసరాలు అందజేస్తున్న సర్పంచ్

అమలాపురం మండలం చిందడగరువు లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన కుటుంబానికి కామనగరువు సర్పంచ్ నక్కా అరుణ కుమారి చంద్ర శేఖర్ బుధవారం బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేసారు. మానవతా దృక్పథంతో చేసిన ఈ సహాయానికి బాధితులు సర్పంచ్ కి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిందాడగరువు సర్పంచ్ పొణకల గణేష్,మాకే చిన్న, నక్కా శ్రీను,మాకే శ్రీను, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

ప్రజాశక్తి-యంత్రాంగం

పలుచోట్ల మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడలు ఉత్సాహంగా బుధవారం ప్రారంభమయ్యాయి. **ఆలమూరు** మండల స్థాయి ఆడు క్రీడలను మండలంలోని చెముడులంకలో ఎస్‌టిఎస్ఎన్ఎం జెడ్‌పి హైస్కూల్లో బుధవారం ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు, ఎంపిడిఒ కె.జాన్ లింకన్ తదితరులు ప్రారంభించారు. క్రికెట్, టెన్నిస్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఇతర గేమ్స్‌కు సంబంధించి ఎంఇఒలు సాలెంరాజు, సుబ్బరాజు ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ రామ స్వరూప్, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్, హౌసింగ్ ఎఇ డి.శ్రీనివాస్, ఎపిఎం ధనరాజు తదితరులు పాల్గొన్నారు. **మండపేట** కేశవరం గ్రామంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో క్రికెట్ పోటీలను ఎంపిపి


ఆలమూరు మండలం చెముడులంక జెడ్‌పి హైస్కూల్లో కబడ్డీ పోటీలను తిలకిస్తున్న ఎంపిపి తదితరులు

ఉండమట్ల వాసు ప్రారంభించారు.కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు గనిశెట్టి సత్తిబాబు, డాక్టర్ డి.రామారావు, కేశవరం పంచాయతీ సెక్రటరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలంలోని ఆయా జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉల్లాసంగా జరుగుతున్నాయి. గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోటీలను బుధవారం జెడ్‌పిటిసి సభ్యుడు సంపదరావు, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు వెంకటేశ్వరరావు సందర్శించారు. **మామిడికుదురు** హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల సాయి పోటీలను ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, పరిపాలనా ధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. **ఆత్రేయపురం** కబడ్డీ, కోకో పోటీలు ఆత్రేయపురం మహాత్మా గాంధీ కళాశాల గ్రౌండ్లో బుధవారం జరిగాయి . ఈ పోటీలను ఆప్కాస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, ఎంపిడిఒ నాతి బుజ్జి ప్రారంభించారు. కార్యక్రమంలో, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్, కనుమూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆత్రేయపురంలో క్రీడలు ప్రారంభిస్తున్న అధికారులు, నేతలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం పలు చోట్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు జరిగాయి. **అంబాజీపేట** ముగ్గులతోనే సంక్రాంతి పండగకు నిండుదనం వస్తుందని వాకలగరువు సర్పంచ్ మద్దింశెట్టి సుబ్బారావు (దొరబాబు) అన్నారు. పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో విప్రో కంపెనీ సౌజన్యంతో బుధవారం సంతూర్ రంగోలి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతి సూట్ కేస్, ద్వితీయ బహుమతి కిచెన్ కుక్కర్ సెట్, తతీయ బహుమతి హట్ బాక్స్ సెట్‌లు బహుమతులతో పాటు మరో 40 మంది ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మహిళలలో చైతన్యం పెంపొందించేందుకు ప్రతీ ఏటా విప్రో కంపెనీ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విప్రో కంపెనీ ఎఎస్ఎం.కె. వెంకటేశ్వరరావు, జెఎస్‌విటి వివి.సూర్యనారాయణ, ఐఎస్ఆర్ కె.ఆనందకుమార్, స్టాకిస్ట్ విజయలక్ష్మి, శ్రీనివాసరావు, వై.దుర్గ, ఎంపిటిసి సభ్యుడు వాకపల్లి కాశీ విశ్వనాధం, వాకపల్లి శ్రీనివాసరావు, చప్పిడి రాజు తదితరులు పాల్గొన్నారు. **మండపేట** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో సర్వారయ, కోకోకోలా, డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఆధ్వర్యంలో రంగవల్లి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను కోకోకోలా ప్రతినిధులు, ప్రిన్సిపల్ డా.టికెవి శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు. అనంతరం భోగి మంట వెలిగించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


వాకలగరువు పంచాయతీ వద్ద విప్రో కంపెనీ ఆధ్వర్యంలో మహిళలకు బహుమతులు

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఆలమూరు

పశువులకు సోకే గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు బి.భాను ప్రసాద్, డి.వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని చెముడులంకలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలను సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ సమక్షంలో బుధవారం వేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొండపాటి చంటి, వైసిపి నేతలు పాల్గొన్నారు.

'98' డిఎస్‌సి ఉపాధ్యాయుల వయోపరిమితి పెంచాలి

ప్రజాశక్తి-రాజోలు

1998 డిఎస్‌సి ఉపాధ్యాయులు వయోపరిమితి పెంచాలని (ఎంటిఎస్) మినిమమ్ టైం స్కెల్ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం శివకోటి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల 1998 డిఎస్‌సి టీచర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కోటిపల్లి రాంబాబు మాట్లాడుతూ 25 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ఫలితంగా తాము ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించామని అన్నారు. సిఎం జగన్ స్పందించి 1998 డిఎస్సీ ఉద్యోగుల వయోపరిమితి 62 ఏళ్ళ కు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోల్మన్ రాజు, ఈశ్వర రావు, రాధాకృష్ణ, రామిరెడ్డి, కె.మూర్తి, డి.సత్యనారాయణ, పి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్ల కేసులను ఎత్తివేయడంపై సరికాదు

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఎపి ఎస్ సి వెల్ఫేర్ కార్యవర్గ సమావేశం అమలాపురం బుద్ధ విహార్ నందు జిల్లా అధ్యక్షులు బత్తుల నకుల రాజు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పేరును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నామకరణం చేసిన సందర్భంలో అంబేద్కర్ పేరును వ్యతిరేకిస్తూ జరిగిన అల్లర్ల కేసులను ఎత్తివేయడంపై ఎపి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఖండించింది. జిల్లా పేరును అంబేద్కర్ జిల్లాగా నామకరణం చేయాలని ఉద్యమం చేపట్టిన దళితులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తకుండా అలానే ఉంచేయడం దారుణమని ఎద్దేవా చేశారు. పోలీసుల ఎదుట ప్రత్యక్షంగా జరిగిన హింస ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు గ్రహించారని అయినప్పటికీ కేసులు ఎత్తివేయడం హాస్యాస్పదమని సభ్యులు అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగారాజు, బత్తుల రమేష్ బాబు, బి ఎస్ ఆర్ ప్రసాద్, అంబటి త్రిమూర్తులు, ఎం. రవి, తదితరులు పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన సభ్యులతో హరీష్, సత్యానందరావు

'టిడిపి'లో చేరికలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పినపల్లలో పలువురు టిడిపిలో బుధవారం చేరారు అమలాపురం టిడిపి పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధూర్, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో కప్పల సునీల్, వక్కపట్ల లక్ష్మణరావు, వక్కపట్ల రాంబాబు, కొత్తూరి సాయిల ప్రోద్బలంతో దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళలు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. దీంతో వారికి సత్యానందరావు, హరీష్ మధూర్ లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.